క్లుప్తంగా

13న రెండు నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ సమావేశం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 13వ తేదీన చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, ఏజెన్సీ మెట్టప్రాంత సీనియర్ నాయకుడు జెట్టి గురునాధరావు చెప్పారు. శనివారం జంగారెడ్డిగూడెంలో వారు సమావేశం వివరాలు తెలియజేశారు. స్థానిక దండమూడి కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ సభ వైఎస్సార్ సీపీ గెలుపునకు నాంది కాబోతోందని అన్నారు. అలాగే సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరనున్నట్లు తెలిపారు. ఈ సభకు వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిధున్ రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జెట్టికి సత్కారం



జెట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

జంగారెడ్డిగూడెం: ఇటీవల వైఎస్సార్ సీపీలోకి చేరిన ఏజెన్సీ మెట్ట ప్రాంత సీనియర్ నాయకుడు జెట్టి గురునాధరావును శనివారం జిల్లా రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెట్టిని దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రజక సంఘం అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని ఆధ్వర్యంలో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు జిల్లాలోని రజకులందరూ ఐకమత్యంతో కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముప్పిడి శ్రీనివాసరావు, రజక సంఘం సీనియర్ నాయకులు సంపంగి నాని, కట్టుంగ సుబ్రహ్మణ్యం, చాటపర్తి వెంకటేశ్వరావు, సీహెచ్ గంగాధర్ రావు, కానూరి రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలరాజు పర్యటన

కొయ్యలగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం సరిపల్లి గ్రామంలో పర్యటిస్తారని పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నూతన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, సొసైటీ గోడౌన్, సీసీరోడ్ల ప్రారంభోత్సవాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వహిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి హాజరవుతారని, పార్టీ శ్రేణులు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గంజిమాలకు సత్కారం



గంజిమాలా దేవిని సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తాను సన్మానం అందుకున్నట్లు రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలాదేవి శనివారం పేర్కొన్నారు. ఏలూరులో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మహిళా అభ్యున్నతి కోసం పాటుపడుతున్న పలువుర్ని సత్కరించారన్నారు. మహిళాలోకాన్ని ఏకతాటిపై నడిపించిన జగనన్నను సీఎంగా చేయడానికి కృషి చేయాలని పద్మశ్రీ పిలుపు ఇచ్చారన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం గ్రామంలో రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయినవిల్లి మంజుశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా మంజుశ్రీని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఆలయ ధర్మకర్త దల్లి గోపీనాథ్ రెడ్డి, సర్పంచ్ గుబ్బల సత్య వేణి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోతిక రెడ్డి, మద్ది ధర్మకర్తల మండల సభ్యులు బాబి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అయినవిల్లి త్రిమూర్తులు, కుమారి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

బుట్టాయగూడెం: మండలంలోని మంచులవారిగూడెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కేరం వెంకటేశ్వరరావు, బుజ్జమ్మ దంపతులకు శనివారం మండల సర్పంచ్‌ల సంఘం ఛాంబర్ అధ్యక్షుడు బన్నే బుచ్చిరాజు ఆదేశాల మేరకు సర్పంచ్‌ల బృందం 25 కేజీల బియ్యం, 2 దుప్పట్లు, 2 టవళ్లు, 2 కేజీల నూనె, కూరగాయలు, రూ. 2 వేల నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సరియం లక్ష్మి, సరియం చల్లయ్య, తెల్లం వెంకాయమ్మ, కుంజా దుర్గ, తాతి సీత, పెడకం విజయలక్ష్మి, ఉయికే బొజ్జి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలపై హింసను వ్యతిరేకించాలి

జంగారెడ్డిగూడెం: స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కేవీ రమణ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ముత్తరాసిపేటలో శనివారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా మహిళలు పురుషులతో కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

నిజాయతీని చూస్తే అవినీతి గుండెల్లో గుబులు

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు



మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న బూత్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం: నిజాయతీని చూస్తే అవినీతి గుండెల్లో గుబులు పుడుతుందని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం అలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం అనే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి నిజాయితీతో పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రతి హామీని తూ.చ తప్పకుండా అమలుచేసి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు సీఎం వైపు నిలబడతారని సర్వే చెబుతుండటంతో ప్రతిపక్షాలకు గుబులు మొదలైందన్నారు. దీంతో సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీని ఎదుర్కొవడానికి వారంతా ఏకమయ్యారని, ఎంత మంది కలిసి వచ్చినా ఒంటరిగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోటీలో నిలిచారన్నారు. నేను మీకు మంచి చేస్తేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా చెప్పగలిగిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. అటువంటి ప్రజా నాయకుడు నిరంతరం ప్రజల కోసం సేవ చేయాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

ప్రతి బూత్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి

రాబోయే రోజుల్లో మహాసంగ్రామాన్ని చూడబోతున్నామని, దాని కోసం ప్రజలను చైతన్య పరిచి నీతి నిజాయితీకి పట్టం కట్టేలా సిద్ధం చేయాలని బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లకు విజయరాజు పిలుపునిచ్చారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎన్ని కుట్రలైనా ప్రతిపక్ష పార్టీలు చేస్తాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జగన్ పాలనలో ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్నికలు జరిగే వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతర శ్రామికుడిలా, యోధుడిలా పని చేసి పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. జంగారెడ్డిగూడెం మండలంలోని 59 బూత్‌లలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలన్నారు. గత ఎన్నికల్లో 56 బూత్‌లలో మెజార్టీ వచ్చిందన్నారు. ఇప్పుడు 59 బూత్‌లలో మెజార్టీ తీసుకువచ్చి తిరుగులేని విజయాన్ని వైఎస్సార్ సీపీకి అందించాలన్నారు. దీనికి ప్రతి గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ అధ్యక్షులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, నియోజకవర్గ పరిశీలకుడు ఎం.సూర్యనారాయణ, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీల కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మండల కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, రాఘవరాజు ఆదివిష్ణు, గురజాల పార్థసారధి, మళ్లీడి బాబి, సాయిజ్యోతిక రెడ్డి, పొన్నాల అనిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, బూత్ కమిటీల కన్వీనర్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయరాజు

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి క్షుణ్ణంగా వివరించాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. శనివారం మండలంలో స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో మండల బూత్ లెవెల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, వారికి సిద్ధం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తూ, వారి ఆర్థిక అభివృద్ధికి అండగా నిలిచారన్నారు. పేదవారి ఎదుగుదలను చూసి ఓర్వలేక, పెత్తందారులైన ప్రతిపక్ష టీడీపీ పార్టీ, దాని మిత్రపక్షం జనసేన పార్టీ నాయకులు మోసపూరిత హామీలతో ప్రజల్లోకి వెళ్తున్నారని, కానీ అది నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు 129 సార్లు బటన్ నొక్కారని, ప్రజలు రెండుసార్లు బటన్ నొక్కి, ఎంపీ అభ్యర్థికి ఒక ఓటు, ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, మండల పార్టీ కన్వీనర్ మిడతా రమేష్ బాబు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, సర్పంచులు పొన్నాల అనిత, వరపల్లి రామ్మోహన్‌రావు, గుండుగోలు సుబ్బారావు, రాష్ట్రం ముదిరాజ్ సంఘ డైరెక్టర్ చిక్కుల శ్రీను, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ చైర్మన్ బీవీఆర్ చౌదరి, చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు సూర్యనారాయణ, చింతలపూడి నియోజకవర్గ బూత్ కమిటీ చైర్మన్ ఆదివిష్ణు, మండల బూత్ కమిటీ చైర్మన్ బొట్ల లక్ష్మణ్, కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, నానాది సాగర్, రాయంకుల సత్యనారాయణ, తమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, కనుమూరు అంజిరెడ్డి, ఎస్‌కే కరిముల్లా, బూరుగు శ్రీను, చింతలపూడి నియోజకవర్గ మహిళ అధ్యక్షులు సాయిల స్వాతి, ఉద్దండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ విజేత అశ్వారావుపేట జట్టు



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుక్కునూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక చర్చి హాస్టల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతగా నిలిచిన అశ్వారావుపేట సిద్దిక్ జట్టుకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, ఎంపీపీ చేట్రోలు గీతావాణి బహుమతులు అందజేశారు. అలాగే రన్నర్స్ ట్రోఫీని జీసీసీ జట్టుకు కుక్కునూరు సర్పంచ్ రావు మీనా వినోద్, మెడల్స్‌ను వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్ అందించారు. కాగా టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10 వేలు నగదు అందజేశారు. క్రీడాకారులకు కోఆప్షన్ సభ్యుడు షేక్ సలీం పాషా టీ షర్ట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో మల్లెల చంటి నాయుడు, సూర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

బుట్టాయగూడెం: మండలంలోని మర్లగూడెం అటవీప్రాంతంలోని ఫారెస్ట్‌శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న జామాయిల్ తోటలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. తోటలో మంటలు చెలరేగడంతో స్థానికులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వెంటనే మంటలను అదుపుచేశారు. ఆకతాయిలు సిగరెట్‌లు వెలిగించి పడవేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

మన్యం వీరుడు అల్లూరి విగ్రహావిష్కరణ



కొయ్యలగూడెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు నేటి రాజకీయ పార్టీలకు ఆదర్శమవ్వాలనీ, యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు నడింపల్లి సత్యనారాయణరాజు పిలుపు ఇచ్చారు. శనివారం కొయ్యలగూడెం - జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఆంధ్రా బ్యాంకు ఎదుట పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్లూరి విగ్రహాన్ని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ జిల్లాల పునర్విభజనలో మన్యసీమకు అల్లూరి సీతారామరాజు జిల్లా అని నామకరణం చేయడం పట్ల ప్రభుత్వానికి క్షత్రియ సేవా సమితి కృతజ్ఞతలు తెలిపింది. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పెన్మెత్స రంగరాజు, సభ్యులు నంబూరి రామచంద్రరాజు, పెన్మెత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనవి అవకాశవాద పొత్తులు

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం
- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాజ్యలక్ష్మి



రెడ్డిగణపవరంలో గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: టీడీపీ, జనసేన పార్టీలవి అవకాశవాద పొత్తులని అత్యధిక మంది ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. బుట్టాయగూడెంలోని పలు గ్రామాల్లో వారు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్డిగణపవరంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోడౌన్, మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. అదే విధంగా సుమారు రూ.16.50 లక్షల వ్యయంతో నిర్మించిన జగనన్న పాలవెల్లువ - పాలశీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, మర్లగూడెం గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో చెప్పిన హామీలు 99 శాతం నెరవేర్చిన నాయకుడుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారన్నారు. విశ్వసనీయత గల నాయకుడిగా జగనన్నను ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. ప్రతిపక్షాల పొత్తులు అనైతిక పొత్తులన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి గారడీ విద్యలతో ఎన్నికలకు సిద్ధమవుతున్నారని టీడీపీ, జనసేనను ప్రజలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. గడచిన ఐదేళ్లల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపును జగనన్నకు కానుకగా ఇద్దామని చెప్పారు. అందుకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసి మొడియం రామతులసి, సర్పంచ్‌లు తెల్లం జయమ్మ, తాతి సీత, వైస్ ఎంపీపీ గగ్గలోతు మోహన్‌రావు, ఎంపీటీసీలు అల్లూరి రామ్మోహన్‌రావు, తెల్లం రమణ, చారపు సుజాత, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, కోఆప్షన్ సభ్యులు బాజీ, తాళ్లూరి ప్రసాద్, తెల్లం చిన్నారావు, కలగర నాని, యాండ్ర రవి, భౌమరాజు సత్యనారాయణ రాజు, తెల్లం దుర్గారావు, మండల సచివాలయాల కన్వీనర్ కణితి దుర్గారావు, మండంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పూజలు

రెడ్డిగణపవరంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ తల్లి, అన్నపూర్ణ, విశ్వేశ్వరస్వామి వారిని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నంది వాహనంపై ఊరేగిన శివయ్య



టి.నరసాపురంలో రథంపై ఊరేగిస్తున్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి



ద్వారకాతిరుమల క్షేత్రంలో నంది వాహనంపై ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం అర్చకులు ఆలయంలో శివయ్యకు విశేష అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలను నిర్వహించారు. రాత్రి ఆలయంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవ మూర్తులను నంది వాహనంపై ఉంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శివయ్య క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, నీరాజనాలు సమర్పించారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

కుక్కునూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి మండలంలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, మాధవరం కొండిన్యముక్తేశ్వరస్వామి, పెద్దరావిగూడెం కేదారేశ్వర స్వామి ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం ఆలయాల వద్ద మహా అన్నదాన కార్యక్రమం, సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. కుక్కునూరు కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

టి.నరసాపురం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి రథోత్సవం నిర్వహించారు. పురవీధుల్లో మేళ తాళాలు, విచిత్ర వేషధారణల నడుమ స్వామివారికి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

మహిళకు గాయలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి హెచ్‌సీ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కొమ్మిరెడ్డి లక్ష్మి సీఎస్ఐ చర్చికి వెళుతుండగా, వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మి స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. ఈ మేరకు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మోటార్‌సైకిలిస్ట్‌పై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ చెప్పారు.

నేత్రపర్వంగా వీరేశ్వరస్వామి గ్రామోత్సవం



తాడువాయిలో వీరేశ్వరస్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



పట్టిసం వీరేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మండుటెండలో వెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా దక్షిణ కాశీగా పేరుగాంచిన తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం స్వామివారి గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. మూలవిరాట్ వీరేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. హర హర మహాదేవా శంభో శంకర నామస్మరణతో తరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సీఐ రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానం చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా గంగాధరరావు, బుద్దాల సత్యనారాయణ, కనికళ్ల ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. దాతలు భక్తులకు మజ్జిగ, మంచినీటిని పంపిణీ చేశారు.


రెండోరోజు భక్త జనసంద్రంగా పట్టిసం

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రం రెండవ రోజు భక్తజనసంద్రంతో పోటెత్తింది. శని, ఆదివారాలు సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శనివారం తెల్లవారుజాము నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి కొంత సమయం గూటాల నుంచి కన్నాపురం అడ్డ రోడ్డు వరకు ఏటిగట్టుపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఏడాది తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 50వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

పట్టిసీమలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ కె.అద్దయ్య, డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి పట్టిసంలో మకాం వేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు జారీ చేశారు. కాలినడకన వెళ్లి వచ్చేందుకు ఏర్పాటు చేసిన మార్గం కూడా కట్టుదిట్టంగా పటిష్టం చేయడంతో అందరూ స్వామి వారిని దర్శించుకున్నారు. పోలవరం సీఐ కె.మధుబాబు, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి, దేవస్థానం ఈవో సంగమేశ్వర శర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రవన్నకు నివాళి



లంకపాకలలో రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శనివారం రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) 8వ వర్ధంతిని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బోసు బొమ్మ సెంటర్లో రవన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బలమైన ప్రతిఘటనోద్యమాలను నిర్మించడమే కామ్రేడ్ రవన్నకు నిజమైన నివాళి అని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ పేర్కొన్నారు.

రవన్న ఆశయ సాధన కోసం కృషి చేయాలి

బుట్టాయగూడెం: మండలంలోని లంకపాకలలో శనివారం రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చింతల మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కె.రాఘవ మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో రవన్న క్రియాశీలకంగా పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. లక్ష్మి, వెంకటేష్, చల్లమ్మ, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా.. శాంతి కల్యాణం

- ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తుల కల్యాణం
- సుందరగిరిపై ముగిసిన మహాయజ్ఞం



కల్యాణ ఘడియలో దేవతామూర్తులు

ద్వారకాతిరుమల: శ్రీ రుద్ర సుదర్శన సహిత నృసింహ 30వ మహాయజ్ఞం ముగింపును పురస్కరించుకుని, ఎక్కడా జరగని విధంగా ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు వారి దేవేరులతో శనివారం ఉదయం సుందరగిరిపై జరిగిన శాంతి కల్యాణ మహోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయ ప్రాంగణములో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామివారికి, శివపార్వతులకు, లక్ష్మీనారాయణులకు, మరో ఇద్దరు దేవతామూర్తులకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. రుత్వికులు, పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కల్యాణ తంతును వీక్షించిన భక్తజనులు పరవశించారు. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన మహా యజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ యజ్ఞం శనివారం తెల్లవారుజామున జరిగిన మహాపూర్ణాహుతితో ముగిసింది. అనంతరం రుత్వికులు, పండితులు సాలిగ్రామాలను అభిషేకించారు. మంగళకర శాంతి మంత్రాలతో రుద్రం, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అందులో అభిషేక జలంగా కలశ ప్రతిష్ఠలో ఉంచిన మంత్రపు జలాన్ని, కొబ్బరి నీరును వినియోగించారు. కల్యాణ తంతు అనంతరం సుమారు 50 రకాల పండ్లు, ఫలహారాలు, స్వీట్లు, ఇతర పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చెర్లకోట సత్య వెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలను సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షించారు.